ఇన్సూరెన్స్‌ కాన్ఫరెన్స్‌-2024 సదస్సు ప్రారంభం



సదస్సును ప్రారంభిస్తున్న ఐఆర్‌డీఏఐసభ్యుడు సత్యజిత్‌త్రిపాఠి

రాయదుర్గం: బీమా రంగంలో సైబర్‌ రిస్క్‌, మోటార్‌ పూల్‌ కార్యకలాపాలకు సంబంధించిన సవాళ్లతో సహా ఉద్భవిస్తున్న ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఇన్సూరెన్స్‌ రెగ్యులేటరీ అండ్‌ డెవలప్‌మెంట్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా(ఐఆర్‌డీఏఐ) సభ్యుడు సత్యజిత్‌త్రిపాఠి సూచించారు. నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌ ప్రాంతంలోని ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇన్సూరెన్స్‌ అండ్‌ రిస్క్‌ మేనేజ్‌మెంట్‌(ఐఐఆర్‌ఎం) క్యాంపస్‌ ఆవరణలో ప్రపంచంలో అతిపెద్ద ఇన్సూరెన్స్‌ సంస్థ స్విస్‌రే సౌజన్యంతో ఐఐఆర్‌ఎం, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో 'ఇన్సూరెన్స్‌: న్యూ నార్మల్‌'అనే థీమ్‌తో ప్రతిష్టాత్మకమైన ఇన్సూరెన్స్‌ కాన్ఫరెన్స్‌-2024 సదస్సును ఆయన జ్యోతి వెలిగించి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవడంతో పాటు ప్రక్రియలను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ఐఐఆర్‌ఎం డైరెక్టర్‌ అంతనుకుమార్‌దాస్‌ మాట్లాడుతూ.. బీమారంగంలో 5.0 ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఇన్సూరెన్స్‌ బ్రోకర్స్‌ అసోసియేసన్‌ ఆఫ్‌ ఇండియా (ఐబీఏఐ) అధ్యక్షుడు సుమిత్‌బోహ్రా మాట్లాడుతూ.. బీమారంగం పురోగతిపై పలు అంశాలను వివరించారు. స్విస్‌ రే పి అండ్‌ సి సొల్యూషన్స్‌ ఆపరేషన్స్‌ హెడ్‌ జితేందర్‌ బఠ్రీ మాట్లాడుతూ.. కస్టమర్‌సెంట్రిసిటీపై దృష్టి సారించి ఇన్సూర్‌టెక్‌ ఆవిష్కరణలు బీమారంగాన్ని ఎలా మారుస్తాయో ఆయన వివరించారు. కార్యక్రమంలో ఐఐఆర్‌ఎం ప్రిన్సిపల్‌ డాక్టర్‌ వివికెమోహన్‌, బీమారంగ నిపుణులు, ప్రముఖులు, ఇన్నోవేటర్లు పాల్గొన్నారు.

మండల స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులు



పోటీలలో పాల్గొన్న విద్యార్థులు, హెచ్‌ఎం తాజ్‌బాబు, ఉపాధ్యాయులు

రాయదుర్గం: రాయదుర్గంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వివిధ పోటీల్లో మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. తమలోని కళానైపుణ్యం, ప్రదర్శనల ద్వారా ప్రతిభను చాటుకున్నారు. ముఖ్యంగా ఓకల్‌ మ్యూజిక్‌, ఇన్‌స్ట్రుమెంటల్‌ మ్యూజిక్‌, డ్యాన్స్‌, థియేటర్‌, విజువల్‌ఆర్ట్స్‌, ట్రెడిషనల్‌ స్టోరీ టెల్లింగ్‌ వంటి విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలు రాయదుర్గం స్కూల్‌ కాంప్లెక్స్‌ హెచ్‌ఎం ఎస్‌కే తాజ్‌బాబు పర్యవేక్షణలో జరిగాయి. ఒక్కో పోటీకి న్యాయ నిర్ణేతలను కూడా ఎంపిక చేసి ప్రదర్శనలో పాల్గొన్న వారిలో మొదటి, రెండవ స్థానాలలో నిలిచిన వారి పాఠశాల పేర్లను ప్రకటించారు. ఈ సందర్భంగా తాజ్‌బాబు మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి మండల స్థాయిలో మొదటి స్థానంలో వివిధ పోటీల్లో నిలిచిన వారిని శనివారం అబ్దుల్లాపూర్‌మెట్‌లో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అవుతారని, అక్కడ వారు తమ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన వారు నవంబర్‌ 1, 2వ తేదీలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని, అందులో ప్రతిభ చాటిన వారిని ఎంపిక చేసి జాతీయ స్థాయిలో పాల్గొనే రాష్ట్ర జట్టును ప్రకటిస్తారని ఆయన వివరించారు.

మండల స్థాయి పోటీలలో విజేతలు వీరే..

ఓకల్‌ మ్యూజిక్‌ కేటగిరిలో మొదటి స్థానంలో విబూతి బాచుపల్లిస్కూల్‌, రెండవ స్థానంలో రాయదుర్గం నాగార్జున స్కూల్‌ విద్యార్థిని అనూష బృందం నిలిచారు. ఇన్‌స్ట్రుమెంటల్‌ మ్యూజిక్‌లో హఫీజ్‌పేట్‌ స్కూల్‌లోని ఇర్ఫాన్‌ బృందం మొదటి స్థానంలో, బాచుపల్లిలోని సెంటియా స్కూల్‌ విద్యార్థిని అర్షియా బృందం రెండవ స్థానం, డ్యాన్స్‌లో రాయదుర్గం నాగార్జున స్కూల్‌ విద్యార్థిని భూమిక, ఎస్‌జీఐ స్కూల్‌ విద్యార్థిని కీర్తన మొదటి, రెండు స్థానాలలో నిలిచారు. థియేటర్‌ విభాగంలో రాయదుర్గం జెడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థి తాజీన్‌, తాజీన్‌ బృందం, విజువల్‌ ఆర్ట్స్‌లో కౌషిక్‌ చారి సెంటియా స్కూల్‌, విక్రమ్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ రాయదుర్గం, ట్రెడీషనల్‌ స్టోరీ టెల్లింగ్‌లో ఎంఎంపేట్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ మొదటి స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన జట్లు శనివారం జరిగే జిల్లా స్థాయిలో పోటీలను అర్హులుగా గుర్తించినట్లు తాజ్‌బాబు వివరించారు.

ప్రాథమిక స్థాయిలోనే అక్రమ నిర్మాణాలను నియంత్రించాలి



టౌన్‌ ప్లానింగ్‌ విభాగంతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న వెస్ట్‌ జోనల్‌ కమిషనర్‌

గచ్చిబౌలి: అక్రమ నిర్మాణాలను ప్రాథమిక స్థాయిలోనే నియంత్రించాలని శేరిలింగంపల్లి వెస్ట్‌ జోనల్‌ కమిషనర్‌ పి.ఉపేందర్‌ రెడ్డి టౌన్‌ప్లానింగ్‌ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జోనల్‌ కార్యాలయంలో టౌన్‌ ప్లానింగ్‌ విభాగంపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించరాదని, అధికారులు ఎటువంటి తప్పిదాలు చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. టీఎస్‌బిపాస్‌ ద్వారా నిర్మాణ అనుమతులను సద్వినియోగం చేసుకునేలా నిర్మాణదారులకు అవగాహన కల్పించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే అనుమతులకు నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆఫీస్‌లో కూర్చుని అనుతుమలు జారీ చేసే విధానానికి స్వస్తి పలకాలని తెలిపారు. కోర్టు కేసులలో సకాలంలో కౌంటర్లు దాఖలు చేసి జాప్యం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. రహదారి విస్తరణను ప్రాధాన్యత తీసుకొని ట్రాఫిక్‌ సమస్యలకు పరిష్కారం చూపించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పార్కులు, ఫుట్‌పాత్‌లు, నాలాల ఆక్రమణలు,ఎస్టీపీ పనితీరు, రహదారుల విస్తరణ, ఆర్‌టీఐ, లోకా యుక్తా కేసులు తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెస్ట్‌ జోనల్‌ శ్యామ్‌కుమార్‌, డీసీలు, ఏసీపీలు, ఇంజినీర్లు, టీపీఎస్‌లు, ఎస్టేట్‌ అధికారులు, చైన్‌మెన్లు పాల్గొన్నారు.

పాదయాత్ర విజయవంతం కావాలి



మాలధారులతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శబరిమల పాదయాత్ర విజయవంతం కావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి కోరారు. శుక్రవారం బీహెచ్‌ఈఎల్‌ టౌన్‌షిప్‌లోని అయ్యప్పస్వామి ఆలయం నుంచి శబరిమల వరకు మాలధారులు చేపట్టిన యాత్రను ప్రారంభించారు. గురుస్వాములు నాగరాజు గౌడ్‌, శ్రీనివాస్‌ రెడ్డి, వెంకటేశ్వర్‌ రెడ్డి, ప్రసాద్‌, దేవేందర్‌ రెడ్డిల ఆధ్వర్యంలో మహాపాదయాత్ర చేపట్టడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌ నాయకులు రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి స్వాములకు రూ.లక్ష అందజేశారు. కార్యక్రమంలో అమీన్‌పూర్‌ మున్సిపల్‌ చైర్మన్‌ పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు చర్యలు చేపట్టండి

మణికొండ: ఎలాంటి అనుమతులు లేకుండా తమ గేటెడ్‌ కమ్యూనిటీల పక్కనే రెడీమిక్స్‌ ప్లాంట్లను కొనసాగిస్తూ వాయు, శబ్ద కాలుష్యానికి కారణం అవుతున్న వారిపై చట్టరీత్యా చర్య తీసుకుని వాటిని మూయించి కాలుష్యాన్ని నివారించేలా చూడాలని గేటెడ్‌ కమ్యూనిటీ నివాసితులు రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను కోరారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల సరిహద్దులో ఉన్న మైహోం అవతార్‌, హాల్‌మార్క్‌ విసినియా గేటెడ్‌ కమ్యూనిటీలలో 12 వేల మంది నివసిస్తున్నారు. వాటి పక్కనే ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు రెడీమిక్స్‌ ప్లాంట్లను కొన్ని నిర్మాణ సంస్థలు కొనసాగిస్తున్నాయన్నారు. దాంతో తమకు రాత్రి, పగలు తేడా లేకుండా దుమ్ము, ధూళి, శబ్ధాలతో అనారోగ్యాలకు గురవుతున్నామన్నారు. వాటిని వెంటనే మూసివేయించాలని శుక్రవారం ఎమ్మెల్యేను కోరారు. దాంతో పాటు తమ గేటెడ్‌ కమ్యూనిటీల ముందు రెడీమిక్స్‌ వాహనాలు తిరిగి రోడ్డు పూర్తిగా పాడయిపోయిందని, దాన్ని బాగు చేయించాలని కోరారు. మైహోం సర్కిల్‌ వద్ద ట్రాఫిక్‌ సిగ్నల్‌ లేకపోవటంతో పలు ప్రమాదాలు జరిగాయని, వెంటనే ఏర్పాటు చేయించాలన్నారు. ముష్కి చెరువులోకి మురుగునీటిని కలుపుతుండటంతో కలుషితం అవుతుందన్నారు. దాన్ని అడ్డుకోవాలని కోరారు. గేటెడ్‌ కమ్యూనిటీ నివాసితులతో పాటు మణికొండ కౌన్సిలర్‌ కె.రామకృష్ణారెడ్డి, నార్సింగి కౌన్సిలర్‌ వెంకటేష్‌యాదవ్‌, నార్సింగి మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ పి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుతో సమస్యలకు చెక్‌

పాపిరెడ్డికాలనీ, పరిసర ప్రాంతాలకు పాత ముంబాయి జాతీయ రహదారితో అనుసంధానం

- రూ.63 లక్షల వ్యయంతో నిర్మాణం చేసేలా పనులకు శ్రీకారం
- 45 రోజుల్లో పూర్తి చేసేందుకు అధికారుల నిర్ణయం
- పాపిరెడ్డికాలనీ-జీహెచ్‌ఎంసీ జోనల్‌ ఆఫీస్‌కు సీసీ రోడ్డు



పాపిరెడ్డికాలనీ నుంచి జీహెచ్‌ఎంసీ జోనల్‌ ఆఫీస్‌ రోడ్డుకు అనుసంధానం చేసేందుకు రోడ్డు నిర్మాణం

శేరిలింగంపల్లి: సరికొత్త రోడ్డు ఏర్పాటు కానుంది. ఈ రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మాణం చేసేందుకు పనులకు చేపట్టడంతో అనేక సమస్యలకు చెక్‌ పడే అవకాశాలు మెరుగయ్యాయి. జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధుల చొరవతో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ రోడ్డు నిర్మాణంతో పలు కాలనీలు, బస్తీలవాసుల అనేక సమస్యలకు చెక్‌ పడినట్లవుతుందని పలువురు పేర్కొంటున్నారు. త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తే బాగుంటుందని పలు కాలనీలు, బస్తీలవాసుల అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా చర్యలు అధికారులు తీసుకుంటారని, ప్రజాప్రతినిధులు పర్యవేక్షిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

కొత్త సీసీరోడ్డు నిర్మాణం వివరాలు..

- పాపిరెడ్డి కాలనీ మొయిన్‌ రోడ్డు నుంచి కొత్తగా జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి జోనల్‌ ఆఫీస్‌ వరకు నిర్మించిన హెచ్‌ఆర్‌డీసీఎల్‌ రోడ్డుకు అనుసంధానం చేసే విధంగా సీసీ రోడ్డు నిర్మాణం.
- ఈ సీసీ రోడ్డు అంచనా వ్యయం రూ.63 లక్షలు.
- ఈనెల 9న ఈ రోడ్డుకు పీఏసీ చైర్మన్‌, స్థానిక ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌ యాదవ్‌, జీహెచ్‌ఎంసీ అధికారుల సమక్షంలో శంకుస్థాపన.



శంకుస్థాపన చేసిన శిలా ఫలకం

ఈ రోడ్డుతో వీరికే లాభం..

- పాపిరెడ్డి కాలనీ, సంధయ్యనగర్‌, రాజీవ్‌ గృహ కల్ప, రాజీవ్‌ స్వగృహ ఆరంబ్‌ టౌన్‌షిప్‌, సురభికాలనీ తదితర కాలనీలవాసులు లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి మీదుగానే రాకపోకలు సాగించాలి.
- ఆయా కాలనీలకు ఒక వైపు రైల్వే ట్రాక్‌ ఉండగా మరో రెండు వైపులా చాకలి చెరువు, గోపీ చెరువులు ఉన్నాయి. దీంతో ఆయా కాలనీల్లో ఉండే సుమారు 55 వేల జనాభా లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి నుంచే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి.
- వర్షం వస్తే రాకపోకలు స్తంభించిపోవడంతో నల్లగండ్ల రైల్‌ ఓవర్‌ బ్రిడ్జి నుంచే వెళ్లాల్సి ఉంది.
- దీంతో రెండు దశాబ్దాలుగా పాపిరెడ్డి కాలనీకి ప్రత్యామ్నాయ రోడ్డు కోసం నిరీక్షిస్తున్న పరిస్థితి.
- ఈ రోడ్డు నిర్మాణంతో ఈ ప్రాంతంలోని వారు గచ్చిబౌలి, కొండాపూర్‌, మాదాపూర్‌, నానక్‌రాం గూడ, నగరంలోని పలు ప్రాంతాలకు వెళ్లే వారు నేరుగా పాపిరెడ్డి నగర్‌ నుంచి శేరిలింగంపల్లి జోనల్‌ ఆఫీస్‌కు వెళ్లే అవకాశం ఉంది.
- లింగంపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద, గుల్‌మొహర్‌ చౌరస్తాలో కూడా ట్రాఫిక్‌ చాలా వరకు తగ్గే అవకాశం లేకపోలేదని పలువురు స్పష్టం చేస్తున్నారు.
- వరదలు వచ్చినప్పుడు ఆయా కాలనీలవాసులు నేరుగా వంద ఫీట్ల రోడ్డు మీదుగా వెళ్లవచ్చు.

రోడ్డు అనుసంధానంతో ప్రజలకు మేలు..



పాపిరెడ్డికాలనీ నుంచి జీహెచ్‌ఎంసీ ఆఫీస్‌ వరకు నేరుగా వెళ్లేందుకు అనుసంధానిస్తూ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం ఈ ప్రాంత వాసులకు మేలు. రెండు దశాబ్దాలుగా ప్రత్యామ్నాయ మార్గం కోసం పలు విజ్ఞప్తులు మేరకు మార్గంసుగమమైంది. అదే విధంగా రాజీవ్‌ గృహకల్ప ఫంక్షన్‌ హాల్‌ నుంచి వంద ఫీట్ల రోడ్డుకు అనుసంధానించే విధంగా రోడ్డు నిర్మాణం చేస్తే మా ప్రాంతవాసులకు ఇబ్బందులు చాలా సౌలభ్యంగా ఉంటది. ఆ రోడ్డు నిర్మాణం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలి.
– బద్దం కొండల్‌ రెడ్డి, పాపిరెడ్డి కాలనీ అధ్యక్షులు

45 రోజుల్లో పూర్తి చేస్తాం..

పాపిరెడ్డి కాలనీ నుంచి జోనల్‌ ఆఫీస్‌ వరకు ఉన్న హెచ్‌ఆర్‌డీసీఎల్‌ రోడ్డుకు అనుసంధానం చేసే సీసీ రోడ్డును 45 రోజుల్లో పూర్తి చేస్తాం. ఆ దిశగా పనులు ప్రారంభించడం జరిగింది. ఆయా కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు ఎంతో అనువుగా ఉంటుంది.
– ఆనంద్‌, డీఈఈ, శేరిలింగంపల్లి సర్కిల్‌

సెంట్రల్‌ టెలికాం బోర్డు సభ్యుడిగా బైండ్ల కుమార్‌




బైండ్ల కుమార్‌కు నియామకపత్రాన్ని అందిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

గచ్చిబౌలి: బీజేపీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్‌ను కేంద్ర టెలికాం బోర్డు సభ్యుడిగా నియమించారు. ఈ మేరకు నియామకపత్రాన్ని శుక్రవారం ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌ ప్రాంతంలోని మెదక్‌ పార్లమెంటు సభ్యుడు రఘునందన్‌రావు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. పార్టీ కోసం ఎన్నో ఏళ్ల నుంచి నమ్మిన సిద్ధాంతం కోసం పార్టీ గెలుపునకు నిరంతరం పనిచేస్తున్న కార్యకర్తలను పార్టీ గుర్తించి బైండ్లకుమార్‌ను ఎంపిక చేయడమే నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా కుమార్‌ను ఆయన అభినందించారు.

నల్ల పోచమ్మ ఆలయ పునర్నిర్మాణం

కూకట్‌పల్లి: బాలానగర్‌ డివిజన్‌ ఇంద్రనగర్‌లో నల్లపోచమ్మ దేవాలయ పునర్నిర్మాణానికి కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ శుక్రవారం శంకుస్థాపన చేశారు. డివిజన్‌ అధ్యక్షుడు మధుగౌడ్‌ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో ఏ బ్లాక్‌ అధ్యక్షులు నాగిరెడ్డి, లక్ష్మయ్య, ప్రకాష్‌ ముదిరాజ్‌, శివచౌదరి, రమణ, కనకయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్‌ పరిధిలోని పాపారాయుడు నగర్‌ కాలనీకి చెందిన సమ్మారావుకు రూ.24 వేల సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును శుక్రవారం పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రఘునాథ్‌ రెడ్డి పాల్గొన్నారు.

విధుల్లో సమయపాలన పాటించాలి



కొండాపూర్‌ జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న వైద్య విధాన పరిషత్‌ కమిషనర్‌

గచ్చిబౌలి: డాక్టర్లు, నర్సులు విధుల్లో సమయపాలన పాటించాలని వైద్య విధాన పరిషత్‌ కమిషనర్‌ డాక్టర్‌ అజయ్‌ పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్‌ జిల్లా ఆస్పత్రిని అకస్మిక తనిఖీ చేశారు. డాక్టర్లు, నర్సులు సకాలంలో విధులకు హాజరు కావాలని లేకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రోగులకు మందులు తప్పకుండా అందజేయాలని, మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. ఆస్పత్రిలోని ఆయా వార్డులు పరిశీలించి రోగులతో మాట్లాడారు. గైనకాలజీ, ఆర్థో, జనరల్‌ సర్జన్‌ విభాగలపై సమీక్షించారు. ఫీవర్‌ కేసులు తగ్గుముఖం పట్టాయని ఆస్పత్రి డాక్టర్లు వివరించారు. అంతే కాకుండా ఆస్పత్రిలో డ్రైనేజీ సమస్య తీవ్రగా ఉందని కమిషనర్‌ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కమిషనర్‌ హామీ ఇచ్చారు. ఆస్పత్రికి సెక్యూరిటీని పెంచాలని కమిషనర్‌ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్‌ జిల్లా ఆస్పత్రి సూపరింటిండెంట్‌ డాక్టర్‌ అనురాగిని రెడ్డి, డాక్టర్లు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలి



శేరిలింగంపల్లి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదివితే భవిష్యత్‌ బంగారుమయం అవుతుందని శేరిలింగంపల్లి కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ అన్నారు. శుక్రవారం చందానగర్‌ బ్రాంచ్‌ జాయా లుక్కాస్‌ జ్యూయలరీ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జిల్లా పరిషత్‌ హైస్కూల్‌కు రూ.2.52 లక్షల విలువ చేసే కంప్యూటర్లు, ఫర్నిచర్‌ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ..పేద విద్యార్థులు మెరుగైన వసతులు కల్పించేందుకు జాయా లుక్కాస్‌ జ్యూయలరీ వారు ముందుకురావడం అభినందనీయమన్నారు. సంస్థలు అందించే సహకారంతో విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా చందానగర్‌ జాయా లుక్కాస్‌ జ్యూయలరీ మేనేజర్‌ రతీష్‌, అకౌంట్స్‌ మేనేజర్‌ ప్రశాంత్‌లను కార్పొరేటర్‌ నాగేందర్‌ యాదవ్‌ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రత్నప్రభ, ఉపాధ్యాయులు భాస్కర్‌ యాదవ్‌, బల్వంత్‌ రెడ్డి, వీరేశం, లక్ష్మి, ఉదయకుమారి, కరుణ, ధనలక్ష్మి, రవీందర్‌ పాల్గొన్నారు.

గ్లోబల్‌ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

సాగినావ్‌ వ్యాలీ యూనివర్సిటీ ప్రతినిధి డేనియల్‌ ఆడమ్స్‌



గెస్ట్‌ లెక్చర్‌లో పాల్గొన్న అతిథి, అధ్యాపకులు

మణికొండ: అంతర్జాతీయంగా ఉన్నత విద్య, మంచి ఉద్యోగం సాధించి రాణించాలంటే గ్లోబల్‌ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతో ఉంటుందని అమెరికాలోని సాగినావ్‌ వ్యాలీ యూనివర్సిటీ ప్రతినిధి డేనియల్‌ ఆడమ్స్‌ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధి, వట్టినాగులపల్లిలో ఉన్న శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్‌ కళాశాలలో శుక్రవారం సాయిన్‌ ఎడ్యుకేషనల్‌ సర్వీసెస్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ సహకారంతో ఉన్నత విద్య అవకాశాలు, ఎదురయ్యే సమస్యలపై గెస్ట్‌ లెక్చర్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యాపరంగా అనేక యూనివర్సిటీలు అవకాశం కల్పిస్తున్నా ఉపాధి రంగాలలో అవకాశాలు దక్కించుకోవటం ఇబ్బందిగా మారిందన్నారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత వృద్ధి, నైపుణ్యాలు, కెరీర్‌ అవకాశాలు, నెట్‌ వర్కింగ్‌, సీవీ మెరుగుదల, పరిశోధన అనుభవం లాంటివి పొందాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అలాంటివి అందించే యూనివర్శిటీలనే విద్యార్థులు ఎంచుకోవాలన్నారు. అడ్మిషన్స్‌, రీసెర్చ్‌, డెవలప్‌మెంట్‌ డీన్‌ డాక్టర్‌ జగదీష్‌, మీడియా, ప్రొటోకాల్‌ డీన్‌ డాక్టర్‌ బి.నరేంద్రకుమార్‌, డాక్టర్‌ యు.శ్రీలక్ష్మి, హెచ్‌ఓడీలు డాక్టర్‌ లిపికా గోయెల్‌, పద్మావతి, డాక్టర్‌ ఎం.రామసుబ్రమణియన్‌, ప్రొఫెసర్‌ డాక్టర్‌ సి.అంజన తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు లక్ష్మీవిహార్‌ ఫేజ్‌-1,ఫేజ్‌-2 కాలనీలు, డాక్టర్స్‌ కాలనీలో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వినియోగదారులు సహకరించాలని వారు కోరారు. నల్లగండ్ల హుడా 11 కేవీ ఫీడర్‌ పరిధిలోని మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1:30 గంటల వరకు నల్లగండ్ల హుడా, నల్లగండ్ల సర్కిల్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

20న శాంతిసరోవర్‌లో బాల బృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్‌ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో బాల బృందావనం కార్యక్రమం నిర్వహిస్తారు. ఆదివారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. 'ఫ్లవర్స్‌ ఆఫ్‌ గాడ్లీ గార్డెన్‌'అనే అంశంపై ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో 9 నుంచి 14 ఏళ్లలోపు వారు పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. వివరాలకు 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

నేడు వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠ

కూకట్‌పల్లి: సంగీత్‌నగర్‌లోని స్వాన్‌లేక్‌ అపార్టుమెంట్‌లో శ్రీ వరసిద్ధి వినాయక స్వామి విగ్రహాన్ని శనివారం ప్రతిష్ఠించనున్నారు. సోమవారం వరకు వివిధ పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ పేర్కొంది. శనివారం ఉదయం 5 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, ఋత్విక్‌ వరణం, యాగశాల ప్రవేశం, ఆదివారం ఉదయం 8 గంటలకు స్థాపిత దేవాతా హవనం, గణపతి శీర్ష హోమం, నవగ్రహ యోగిని, జలదివాస, ధాన్యదివాస, శయ్యాదివాస, పుష్పాది వాసములు, తీర్థ ప్రసాద వితరణ, సోమవారం ఉదయం ఆదివాస హోమాలు, అనంతరం విఘ్నేశ్వర స్వామి యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ కలశ ప్రతిష్ఠాపనము, పూర్ణాహుతి, పండిత ఆశీర్వచనములు, తీర్థ ప్రసాదములు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



డ్రైనేజీ సమస్యను పరిశీలించి మాట్లాడుతున్న కమలాకర్‌రెడ్డి

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌ పరిధిలోని పీజేఆర్‌ నగర్‌ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని బీజేపీ డివిజన్‌ అధ్యక్షుడు కమలాకర్‌ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎల్లమ్మబండ, పీజేఆర్‌ నగర్‌ కాలనీలో సమస్య నెలకొన్న ప్రాంతంలో బీజేపీ నాయకులతో కలిసి పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్య పీజేఆర్‌ నగర్‌ కాలనీ వాసులకు శాపంగా మారిందని, వెంటనే సమస్యకు పరిష్కారం చూపాలని వాటర్‌వర్క్స్‌ డీజీఎం నాగప్రియతో ఫోన్‌లో మాట్లాడారు.

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ



దాతలు అందజేసిన కిరీటాన్ని అందుకుంటున్న రమేష్‌ అయ్యంగార్‌

మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ స్నేహపురి కాలనీకి చెందిన మారూరి విశ్వనాథ్‌ చారి, లక్ష్మణ్‌, శ్రీనివాస్‌ కుటుంబ సభ్యులు లలిత అమ్మవారికి 850 గ్రాముల వెండి కిరీటాన్ని చేయించారు. శుక్రవారం ఆలయ ప్రధాన సేవకుడు రమేష్‌ అయ్యంగారుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కిరీటాన్ని అందజేసిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలకు మెగా జాబ్‌ మేళా

మోతీనగర్‌: కష్టపడి పనిచేసే తత్వం ఉంటే ఏ రంగంలోనైనా దినదినాభివృద్ధి చెందుతారని నిర్మాణ సేవా సంస్థ ప్రతినిధి సంపత్‌ కుమార్‌ అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్‌ డివిజన్‌ గాయత్రినగర్‌లో శుక్రవారం మహిళలకు మెగా జాబ్‌ మేళా నిర్వహించారు. పలు కంపెనీల ప్రతినిధులు మేళాకు హాజరయ్యారు. ప్రతిభ గల మహిళలను ఎంపిక చేసి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్‌ రంగంలో కూడా ప్రతిభను గుర్తించి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, వాటిని సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ బిల్డర్స్‌ పి. శ్రీనివాసరావు, వీడియో కంపెనీల ప్రతినిధులు శశికాంత్‌, పావని, శైలేష్‌, శ్రీనివాసరావు, రఘుపతి, స్వామి, భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

వీసీ నియామకం అభినందనీయం

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి (వీసీ)గా బలహీన వర్గాలకు చెందిన ప్రొఫెసర్‌ అల్దాస్‌ జానయ్యను నియమించడం అభినందనీయమని బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి దశరథ్‌ అన్నారు. ముఖ్యమంత్రి రెవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌ గౌడ్‌కు ఈ సందర్భంగా వారు ధన్యవాదాలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్‌ ప్రభుత్వం బలహీనవర్గాల ప్రభుత్వమని మరో సారి రూజువు అయిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు రమేష్‌, కృష్ణ, కవిత, సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తాం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో కొన్ని కాలనీలలో సమస్యలు ఉన్నాయని, వాటిని నిధులు లభ్యతను బట్టి త్వరలోనే పరిష్కరిస్తామని మున్సిపల్‌ చైర్మన్‌ కె.నరేందర్‌ముదిరాజ్‌ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ఆల్‌ కాలనీస్‌ ఫెడరేషన్‌ అధ్యక్షుడు డాక్టర్‌ అవినాష్‌, ప్రధాన కార్యదర్శి వి.అంజనేయులు ఆధ్వర్యంలో పలు కాలనీల నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా కాలనీలలో పార్కులు, కమ్యూనిటీ హాల్‌లు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల ఏర్పాటు గురించి ఆయనతో చర్చించారు. ఆయు పనులన్నింటినీ త్వరలోనే పూర్తి చేస్తామని చైర్మన్‌ హామీ ఇచ్చారు. కోశాధికారి బాబురావు, పలు కాలనీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.